క్లుప్తంగా

'అధిక సాంద్రత'తో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శివకృష్ణ

బెల్లంపల్లిరూరల్: పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి పాటించడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కోట శివకృష్ణ అన్నారు. మండలంలోని చంద్రవెల్లి, పెర్కపల్లి గ్రామ శివారులో సోమవారం అధిక సాంద్రత పద్ధతి ద్వారా రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలో కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్ ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ, పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తమిళనాడులోని జాతీయ పత్తి పరిశోధన సంస్థ రీజినల్ కార్యాలయ సీనియర్ శాస్త్రవేత్త సంపత్‌కుమార్, బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఏఈవోలు నాగదీప్తి, శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

మంచిర్యాలఅర్బన్: సీపీఎస్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. మంచిర్యాలలో సోమవారం మాట్లాడుతూ.. సీపీఎస్ వల్ల దేశంలోని ఏ ఉద్యోగికి బెనిఫిట్ లేకపోగా, తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. సీపీఎస్ రద్దు, ఎన్ఈపీ 2020రద్దు చేసి కొత్త పాలసీ ప్రకటించాలని ఎస్టీఎఫ్ఐ, ఏఐఎస్‌జీఈఎఫ్, సీసీజీఈడబ్ల్యూ, ఏఐఎస్‌జీపీఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 3న నిర్వహించే 'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిబంధనలు పాటించాలి

భీమిని: అసెంబ్లీ ఎన్నికల కోడ్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తాండూర్ సీఐ శ్రీనివాస్ అన్నారు. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామంలో సోమవారం ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీ విజిల్ యాప్, మోడల్ కోడ్ కండక్ట్, వైలెన్స్‌పై వివరించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయొద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, పోలీసులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని శ్రీరాంపూర్ మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ కె. ప్రవీణ్‌కుమార్ సూచించారు. దండేపల్లిలో సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. నిబంధనలు తప్పక పాటించాలన్నారు. మైక్‌లు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జైపూర్: మండలంలో పనిచేస్తున్న సెర్ప్ వీవోఏలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీఎం రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని మహాలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు సెర్ప్ వేతనాలు గ్రేడింగుతో సంబంధం లేకుండా మంజూరు చేయాలని కోరారు. 6 నెలల వేతనాలను గ్రేడింగ్ చూపించి, వేతనాల్లో కోత విధించాలని ఇప్పటికైనా తమకు గ్రేడింగుకు సంబంధం లేకుండా వేతానాలు ఇవ్వాలని కోరారు. సీసీలు సహకరించాలని, తమకు రావాల్సిన 4నెలల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీవోఏలు భీమరాజు, రమేశ్, కుమార్, రాజేశ్వరి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

హోమియో మందులు పంపిణీ

పాతమంచిర్యాల: మంచిర్యాల పట్టణంలోని జన్మభూమినగర్‌లో డా.కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రహీమ్ బ్లడ్ వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజర్ అబ్దుల్ రహీమ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఇరికిల్ల పురుషోత్తం మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి హోమియోపతి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. డాక్టర్ కేర్ హోమియోపతి వైద్యుడు మల్లేశ్, ఆసుపత్రి మేనేజర్ రజిత ఆధ్వర్యంలో సుమారు 120మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్, రాజు నాయక్, గీత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

కాసిపేట: మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో సోమవారం సీస్ పరీక్ష (స్టేట్ ఎడ్యూకేషన్ అచీవ్‌మెంట్ సర్వే)పై తాండూర్, కాసిపేట మండలాలకు చెందిన విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నవంబర్ 3న విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, తాండూర్, కాసిపేట మండలాల ఎంఈవో వాసాల ప్రభాకర్, మండల నోడల్ అధికారి లచ్చయ్య, ప్రిన్సిపాల్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రి సరే.. ఆధునిక సేవలేవి?

ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇటీవల చెన్నూర్‌లో నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో ఆధునిక సేవలు కరువయ్యాయి. దీంతో నిరుపేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారు.



- చెన్నూర్ సామాజిక ఆస్పత్రిలో రోగులకు అందని సేవలు
- స్కానింగ్, డయాలసిస్, ఎక్స్‌రే కోసం ప్రైవేటుకే...
- మరో మూడు నెలలు ఇదే పరిస్థితి అంటున్న అధికారులు


చెన్నూర్: నియోజకవర్గంలోని సామాజిక ఆసుపత్రిలో ఆధునిక సేవలు కరువయ్యాయి. ప్రధాన సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులు పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. చెన్నూర్ మున్సిపాలిటీలో గత నెలలో నూతనంగా ప్రారంభించిన 50పడకల ఆసుపత్రిలో స్కానింగ్, డయాలసిస్, ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి రాలేదు. ఎన్నికల నేపథ్యంలో కొత్త పరికరాలు, వైద్యులు, సిబ్బంది బదిలీలు లేకపోవడంతో మెరుగైన వైద్య సేవల కోసం ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెలకొంది.

సరైన సిబ్బంది లేక ..

చెన్నూర్ మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ నెల 7న వైద్య ఆరోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. చెన్నూర్‌లో ఆసుపత్రి ప్రారంభం కావడంతో ప్రతీ రోజు 300నుంచి 400మంది రోగులు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. రూ.10కోట్ల నిధులతో ఆసుపత్రి భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించినప్పటికీ సరైన వైద్యులు, సిబ్బంది, పరికరాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో షుగర్ వ్యాధిగ్రస్తులు రక్త, మూత్ర పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది.

చెడిపోయిన స్కానింగ్

గర్భిణులు, కిడ్నీ బాధితులు, ఎముకల సంబంధిత ఖరీదైన సేవలు చెన్నూర్ ఎంసీహెచ్‌లో అందుబాటులోకి రాలేదు. స్కానింగ్ పరికరం గత మూడేళ్ల క్రితమే ఆసుపత్రిలో ఉన్నప్పటికీ స్కానింగ్ ఆపరేటర్ లేకపోవడంతో నేటికి అందుబాటులోకి రాలేదు. దీంతో స్కానింగ్ చెడిపోయింది. కొత్త స్కానింగ్ కోసం వైద్యులు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. ప్రతి బుధవారం సుమారు వందకు పైగా గర్భిణీ మహిళలు పరీక్షలకు వస్తున్నారు. స్కానింగ్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. డయాలసిస్



యూనిట్లు వచ్చినప్పటికీ నేటికి ప్రారంభం కాలేదు. ఎక్స్‌రే ప్లాంట్ లేదు. డయాలసిస్, ఎక్స్‌రే స్కానింగ్‌ల సౌకర్యం లేకపోవడంతో గర్భిణులు, కిడ్నీ, ఎముకల సంబంధిత రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..

మెరుగైన సేవలందించే పరికరాలు అందుబాటులో లేవు. ఎక్స్‌రే, స్కానింగ్, డయాలసిస్ కోసం పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. వైద్యులు పూర్తి స్థాయిలో లేరు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– చకినారపు కిరణ్‌కుమార్, స్థానికుడు

అభివృద్ధి చూసి ఓటెయ్యండి

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



నర్సింగాపూర్‌లో ప్రచారంలో ఎమ్మెల్యే

శ్రీరాంపూర్: అభివృద్ధిని చూసి ఓటేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ వాటర్‌ట్యాంక్ ఏరియా 9వ వార్డులో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనను మరోసారి మంచిర్యాల ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. సింగరేణి శ్రీరాంపూర్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇళ్ల పట్టాల పంపిణీ నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ దయవల్ల జరిగిందన్నారు. ప్రజలు మరోమారు బీఆర్ఎస్‌కు పట్టం కడితే మరిన్ని అభివృద్ధి ఫలాలు పొందుతారన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు నాండ్ల సంతోశచారీ, వార్డ్ కౌన్సిలర్లు బౌతు లక్ష్మి, వంగ తిరుపతి, పూదరి కుమార్, బడికే లక్ష్మి, నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌లో సోమవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, నాయకులు పాల్గొన్నారు. కేసీఆర్ వేషధారణలో వ్యక్తి పర్యటిస్తూ ప్రచారం చేయడం ఆకట్టుకుంది.

'అన్ని వర్గాలకు బీఆర్ఎస్ అండ'

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో పాటు, అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

'నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా'



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

జన్నారం: వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు నిర్విరామంగా పనిచేస్తూ, గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యకర్తలు గ్రూప్ విభేధాలకు తావులేకుండా, కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. గడపగడపకూ వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను తెలియజేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు రాజారాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ ఆలీఖాన్, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ రియాజుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

'కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ బలం'



ముఖ్య కార్యకర్తలతో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్

తాండూర్: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. కాంగ్రెస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాదారం ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి నివాసంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి గడ్డం వినోద్ హాజరయ్యారు. కార్యకర్తలు, నాయకులతో త్వరలో జరగబోయే ఎన్నికల్లో వ్యవహరించాల్సిన విధానాలపై చర్చించారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేస్తే కాంగ్రెస్ పార్టీ విజయం తధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారంలో ఇటీవల ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి, కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదవరపు సృజననర్సింగరావు, సర్పంచ్ వసంత–రాజేందర్, వార్డు సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి'

నస్పూర్: పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్‌పీ) ఎమ్మెల్యే అభ్యర్థి ఏదునూరి రమేశ్ కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన రజక సామాజిక వర్గానికి చెందిన నేను డీఎస్‌పీ(ధర్మ సమాజ్ పార్టీ) తరుపున మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తన పార్టీ టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శులు కంచర్ల సదానందం, పెద్దపల్లి సూరన్న, నాయకులు కొండ్ర కల్యాణ్, కొండు రాజు, వెంగల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



నినాదాలు చేస్తున్న మహిళలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 5వార్డు నంబర్–2 ఇంక్‌లైన్ బస్తీకి చెందిన మహిళలు, యువకులు బీజేపీలో చేరారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. వీరికి శ్రీదేవి కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. మోదీ నాయకత్వాన్ని బలపర్చి ఎన్నికల్లో తనను అధిక మెజార్టీతో గెలిపించాని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, అసెంబ్లీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ రాజులాల్, నాయకులు మహేష్, చిరంజీవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



సీసీసీలో ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథ్

నస్పూర్: రాబోయే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. సీసీసీలోని సంఘం మల్లయ్యపల్లెలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పట్టణంలోని కాంగ్రెస్ నాయకుడు ప్రేంసాగర్‌రావు పేదలకు చెల్లని ఇళ్ల పట్టాలు ఇచ్చి పేద ప్రజలను మోసం చేశారని, బీఆర్ఎస్ నాయకులు పట్టణంలోని పేదల భూములను కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే, అర్హులైన ప్రతీ పేదవాడికి ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సత్రం రమేశ్, జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

'శ్రీదేవి టికెట్‌ను రద్దు చేయాలి'



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవి టికెట్‌ను వెంటనే రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. మండలంలోని లంబాడితండా గ్రామంలోని ప్రధాన రహదారిపై సోమవారం మద్దతుదారులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. ఎనిమిదేళ్ల నుంచి గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం కోసం అహర్నిశలు శ్రమించానని ఏమాజీ తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన తనకు కాదని, నెల రోజుల క్రితం పార్టీలోకి వచ్చిన శ్రీదేవికి టికెట్ కేటాయించడం దారుణమన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం పునరాలోచన చేసి శ్రీదేవి టికెట్‌ను రద్దు చేసి, తనకు టికెట్ ఇవ్వాలన్నారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్, ప్రకాష్, సత్యనారాయణ రెడ్డి, నర్సింగం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హాజీపూర్, పెద్దంపేట గ్రామాల్లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గడపగడపకూ ప్రచారం నిర్వహిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ వివరిస్తూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలని కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, సర్పంచ్ పొట్టాల సుమలత, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, ఒడ్డె శ్రీనివాస్, రవి, ఒడ్డె రాజమౌళి, సాంబారి కుటుంబరావు, రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ముల్కల్లలో ఏర్పాటు చేసిన మహిళా ఆత్మీయ సమ్మేళనంలో నాయకులు గోనె సతీశ్‌రావు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు.

చెన్నూర్ టికెట్ నేతకానీలకు కేటాయించాలని దీక్ష



జైపూర్: నేతకానీల రిలే నిరాహార దీక్ష

జైపూర్: కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ అసెంబ్లీ టికెట్ నేతకానీలకు కేటాయించాలని కోరుతూ తెలంగాణ నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నేతకాని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు పొట్టాల నాగరాజు మాట్లాడుతూ.. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని చెన్నూర్ నియోజకవర్గంలో నేతకాని సామాజిక వర్గానికి చెందిన ఓట్లు 60వేలకు పైగా ఉన్నాయని, నేతకాని సంఘం నేత గోమాసే శ్రీనివాస్‌కు టికెట్ కేటాయిస్తే లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, శ్రీనివాస్, లింగయ్య, కామెర అనూష, లక్ష్మి, రమేశ్, మంగ, సంతోశ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'చెన్నూర్ టికెట్ మాదిగలకే కేటాయించాలి'

భీమారం: చెన్నూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేటాయించకుంటే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, నియోజకవర్గం కో ఆర్డినేటర్ సత్యనారాయణ, మండల ఇన్‌చార్జి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాహుల్

బెల్లంపల్లి: పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ బి.రాహుల్ ఆదేశించారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గంలో 227పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విధిగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని, మూత్రశాలలు, శౌచాలయాలు పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని వెబ్ కాస్టింగ్ చేయడం జరుగుతుందన్నారు. సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పకపాటించాలి..

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తప్పక ఎన్నికల నిబంధనలు పాటించాలని బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అభ్యర్థులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ర్యాలీలు, సభలు, సమావేశాలకు తప్పక అనుమతి తీసుకోవాలని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించొద్దని పేర్కొన్నారు. అభ్యర్థుల ప్రచారాన్ని పరిశీలించడానికి సంబంధిత అధికారులను నియమించామన్నారు. ఆయా సమావేశాల్లో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌లో చేరిక

వేమనపల్లి: మండలంలోని రాజారాం, నాగారాం గ్రామాలకు చెందిన 300మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నీల్వాయి ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీఆర్‌ఆలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో మల్లేష్, బుర్స శంకర్, బాపు, భాస్కర్, శ్రీను, నాగారాం గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి, నాగేష్, రవి తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మధు, ఎంపీటీసీ చంద్రకళ, ఎనగంటి రోశిరెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ లచ్చయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఒడిశ్ల రాజన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల ఆవరణలో సోమవారం పరిసరాల పరిశుభ్రతపై సీహెచ్‌వో రామ్మూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ అల్లడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

'సుమన్‌కు అవకాశమివ్వాలి'

భీమారం: చెన్నూరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న బాల్క సుమన్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ నియోజవర్గ నాయకులు వేముల శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. మరోసారి సుమన్‌కు అవకాశం కల్పించి బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రెడ్డికాలనీలో ప్రచారం

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు గెలిపించాలని, అప్పుడే అన్ని వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సతీమణి స్రవంతి సోమవారం జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. రెడ్డికాలనీలోని ఇంటింటికీ వెళ్లి, బీజేపీకి ఓటు వేస్తే పట్టణ అభివృద్ధి, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజలకు వివరించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లికి చెందిన తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దాత జయరాం సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాజం, రామన్న, నగేష్, వెంకటరాజం,హెచ్‌ఈవో సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.